సాక్షి
కాకినాడ
సోమవారం । 9 । డిసెంబర్ । 2024




ఇళ్ల మధ్య మద్యం దుకాణమా!
ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తరలించాలని సీతానగరంలో మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు.



వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం
బిక్కవోలులో శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుతున్నాయి.

8లో

డెల్టాలకు 10,200 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,500 కలిపి. మొత్తం 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

లోవలో భక్తుల రద్దీ


లోవ ప్రాంగణంలో భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చిన 6 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.3,90,831 ఆదాయం సమకూరిందని వివరించారు.

ఆర్టీసీ కండక్టర్‌కు జాతీయ అవార్డులు


అవార్డులు అందుకుంటున్న కండక్టర్ ప్రసాదరావు

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కొలూరి ప్రసాదరావు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు అందుకున్నారు. న్యూఢిల్లీలోని పంచశీల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సుమనాక్షర్ ఆధ్వర్యాన కేంద్ర మాజీ మంత్రి, ఏపీ మాజీ గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే అవార్డులు అందజేశారు. ప్రసాదరావు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని తల్లీకూతుళ్ల మృతి
గోపాలపురం: వేగంగా దూసుకువచ్చిన ట్రాక్టరే వారి పాలిట మృత్యుశకటమైంది. మండలంలోని దొండపూడి గ్రామ శివార్లలో ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు తల్లీకూతుళ్లు ఆదివారం మృతి చెందారు. ఎస్సై కర్రి సతీష్ కుమార్ కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పోలవరం మండలం బక్కబండ్లగూడెం గ్రామానికి చెందిన కురసాని కాంతమ్మ (45), ఆమె తల్లి కవలం గన్నెమ్మ (72) కలసి గోపాలపురం మండలం దొండపూడికి స్కూటీపై వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి వెళుతుండగా గ్రామ శివార్లలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను 108లో రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. మృతురాలు కాంతమ్మ బక్కబండ్లగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోందని తెలిపారు.

కూటమి వారి కోతల బాట!

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల కోసం సూపర్ సిక్స్‌తో పాటు ఎడాపెడా హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం .. ఆరు నెలలైనా వాటిని అమలు చేయలేక చేతులెత్తేసింది. మరోవైపు ఇప్పటికే అమలవుతున్న పథకాల్లో కోతలు పెట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన పథకాల్లో కోత పెట్టేందుకు ఇప్పుడు భారీ స్కెచ్ వేసింది.

- పింఛన్ల తొలగింపునకు సర్కార్ స్కెచ్!
- అనర్హుల గుర్తింపు సాకుతో నేటి నుంచి సర్వే
- తుని మండలం రేఖవానిపాలెంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- సర్వేకు 11 బృందాల ఏర్పాటు
- ఇతర మండలాల సిబ్బంది నియామకం



పింఛన్ల సర్వే జరగనున్న రేఖవానిపాలెం గ్రామం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మతం, వర్గం, రాజకీయం వంటి వివక్షలేవీ లేకుండా, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అందరికీ పింఛన్లు, ఇతర పథకాలు అందజేసింది. పింఛన్లకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియని అభాగ్యుల ఇళ్లకు నాటి గ్రామ/వార్డు వలంటీర్లు నేరుగా వెళ్లి, సచివాలయంలో దరఖాస్తు చేయించి, పింఛన్లు మంజూరు చేయించారు. అంతకుముందు ఎన్నడూ లేని రీతిలో.. పూర్తి పారదర్శకంగా చివరకు అర్హత ఉన్న టీడీపీ నాయకులకు, ఆ పార్టీ సానుభూతిపరులకు సైతం పింఛన్లు అందించారు. మంజూరైన పింఛన్లను ప్రతి నెలా ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే తలుపు తట్టి మరీ అందించేవారు. దీంతో వృద్ధులు, ఇతర అభాగ్యులు నిశ్చింతగా జీవనం సాగించేవారు. రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలకు అందుతున్న పింఛన్లలో కోత పెట్టేందుకు భారీ స్కెచ్ వేసింది. ఇందులో భాగంగా అనర్హులను గుర్తించే సాకుతో జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, పింఛన్లపై నేటి నుంచి సర్వే చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ పథకాల్లో కూడా కూటమి సర్కార్ కోత పెడుతుందేమోనని లబ్ధిదారులు గుబులు చెందుతున్నారు.

కూటమి సర్కార్ గద్దెనెక్కాక జిల్లాలో తొలగించిన పింఛన్లు

నెల	పింఛన్లు
జూలై	2,629
ఆగస్టు	2,873
సెప్టెంబర్	2,732
అక్టోబర్	3,877
నవంబర్	2,869

రేఖవానిపాలెంలో ప్రస్తుతం ఉన్న పింఛన్ల వివరాలు

జనాభా	2,812
కుటుంబాలు	967
మొత్తం పింఛన్లు	433
వృద్ధాప్య పింఛన్లు	212
వితంతు	120
దివ్యాంగులు	86
ఒంటరి మహిళ	8
అభయహస్తం	5
చేనేత	1
కుష్ఠు రోగులు	1

ప్రతి 50 పింఛన్లకు ఒక బృందం

కోతల స్కెచ్ అమలులో భాగంగా చేపడుతున్న సర్వే కోసం జిల్లాలోని తుని మండలం రేఖవానిపాలెం గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో సోమవారం నుంచి సర్వే మొదలు పెట్టనున్నారు. ప్రతి 50 పింఛన్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈవిధంగా ఈ గ్రామంలో 11 బృందాలు పని చేయనున్నాయి. పారదర్శక సర్వేగా నమ్మించే వ్యూహంతో ప్రతి బృందంలో ఇతర మండలాలకు చెందిన ఒక గెజిటెడ్ అధికారిని, ఒక సచివాలయ ఉద్యోగిని నియమించారు. ఇది సర్వే మాత్రమేనని బయటకు చెబుతున్నా టీడీపీ నేతలు, ఆ పార్టీ శ్రేణుల ప్రోద్బలంతో తమకు నచ్చని వారి పింఛన్లు తొలగించేస్తారని పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. కేవలం పింఛన్ సొమ్ములతోనే నెలంతా పొట్ట పోసుకుంటున్న అభాగ్యులను ఇబ్బంది పెట్టేందుకే అనర్హుల సాకుతో ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని భయపడుతున్నారు.

ఇప్పటికే ప్రతి నెలా కోతలు

వాస్తవానికి అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో అన్ని అర్హతలూ ఉన్న వారు కొత్త పింఛన్ల కోసం గంపెడాశతో నిరీక్షిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్త పింఛన్ మాట దేవుడెరుగు.. సర్వే పేరిట ఇప్పుడు ఉన్న పింఛన్లకు కోత పెట్టే కొత్త ఎత్తుగడను కూటమి ప్రభుత్వం వేసిందని వివిధ వర్గాలు ఆరోపిస్తున్నాయి.



పింఛన్ ఇస్తున్న వలంటీర్ (పాత చిత్రం)

మరోవైపు 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు ఇస్తామంటూ ఎన్నికల వేళ కూటమి ఇచ్చిన హామీ ఏమైందని నిలదీస్తున్నారు. కారణాలేవైనప్పటికీ కూటమి సర్కార్ గద్దెనెక్కినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా పింఛన్లు తగ్గిపోతూ వస్తున్నాయి. ఇప్పుడు సర్వే చేసి ఇంకా ఎన్ని పింఛన్లు తీసేస్తారోననే ఆందోళన సర్వత్రా నెలకొంది. పింఛన్ మొత్తం పెంచామని గొప్పగా సంబరాలు చేసుకున్న సర్కార్.. ఇప్పుడు ఈ సర్వే ఎందుకు చేపట్టిందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వితంతు పింఛన్లను పరిమితం చేసేలా..

ప్రస్తుతం జిల్లాలో ప్రతి నెలా 74,540 మందికి వితంతు పింఛన్లు అందుతున్నాయి. వీటిని కొందరికే పరిమితం చేసేలా ప్రభుత్వం ఇటీవల నిబంధనలను సవరించింది. నవంబర్ 1 – డిసెంబర్ 1 మధ్య పింఛన్ పొందుతున్న భర్త మృతి చెంది ఉంటే.. భార్యకు డిసెంబర్ నుంచి వితంతు పింఛన్ అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీని ప్రకారం అంతకు ముందు జనవరి నుంచి నవంబర్ 1 కంటే ముందు పింఛన్ పొందుతున్న భర్తను కోల్పోయిన భార్యకు పింఛన్ మంజూరు కాదన్నమాట. అటువంటి వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా చేశారనే విమర్శలు వస్తున్నాయి.

అభాగ్యులకు అన్యాయం


50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు ఇస్తామంటూ కూటమి ఇచ్చిన హామీ ఏమైంది? కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఇప్పుడు ఏదో సర్వే చేస్తున్నట్లు పత్రికల్లో చూశాం. సామాజిక పింఛన్లు తొలగిస్తే అభాగ్యులు అన్యాయమైపోతారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేవలం అర్హతే ప్రామాణికంగా, పూర్తి పారదర్శకంగా పింఛన్లు అందజేసింది. ఎక్కడా వివక్ష చూపలేదు. అటువంటి సామాజిక పింఛన్లలో సర్వే పేరుతో కోత పెట్టాలనే ఆలోచన మానుకోవాలి. పింఛన్లు తొలగించే ఎటువంటి చర్యలపైనైనా పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధమవుతుంది.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

సర్వే పేరుతో తొలగించొద్దు


నిరుపేద, మధ్యతరగతి వర్గాల్లోని అభాగ్యులు కేవలం పింఛన్ పైనే ఆధారపడి జీవితాలు వెళ్లదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే కొత్త పింఛన్లు వస్తాయని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. అటువంటిది అర్హత పేరుతో సర్వే అంటూ ఇప్పుడున్న పింఛన్లు తొలగించరాదు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఆరు నెలలైనా అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. ఉన్న పింఛన్లు తొలగించే కుట్రలు చేయడం అన్యాయం.

– తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కాకినాడ

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- రూ.30 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడానికి తోడు శనివారం రాత్రి రత్నగిరితో పాటు పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధువులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణునికి పూజలు చేశారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు 1,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

కన్నుల పండువగా రథోత్సవం

స్వామివారి ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం మేళతాళాల మధ్య ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల విగ్రహాలను అర్చకులు వేంచేయించి పూజలు చేశారు. అనంతరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్ రావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

వెండి కిరీటాల సమర్పణ


స్వామివారిని దర్శించుకుంటున్న దాతలు

పెదపూడి: జి.మామిడాడలో వేంచేసిన శ్రీ కోదండ రామాలయంలో సీతమ్మవారు, శ్రీరాముడు, లక్ష్మణ స్వామి వార్ల విగ్రహాలకు దాతలు వెండి కిరీటాలను విరాళంగా సమర్పించారు. అదే గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, దాత జగ్గిరెడ్డి తల్లిదండ్రులు సబ్బెళ్ల సూరారెడ్డి (శంకరం), రామకుమారి దంపతులు సుమారు 2 కేజీల వెండితో చేయించిన కిరీటాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామి వారిని దర్శించుకున్నారు. దాత సూరారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని, ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

వనమంతా జనమై.. స్టెప్పులతో అదరగొట్టి..



కాకినాడ క్రైం: స్థానిక కరణంగారి జంక్షన్ రోడ్డులోని గర్ల్స్ పాలిటెక్నిక్ (జీపీటీ) కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఫార్మసీ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం వనసమారాధన కోలాహలంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఫార్మసిస్టులు వారి కుటుంబీకులతో కలిసి ఈ వేడుకకు హాజరు కావడంతో.. ఆ ప్రాంగణం వనమంతా జనమే అన్నట్టుగా మారిపోయింది. నృత్యాలు, ఆటపాటలు, క్విజ్ పోటీలు, మ్యూజికల్ చైర్స్, కపుల్ చైర్స్, అంత్యాక్షరి, హౌసీ, బెలూన్ గేమ్‌తో వనసమారాధన వేడుక సందడిని పంచింది. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఇదే కళాశాలలో ఫార్మసీ చదివి, ఉద్యోగాలు చేస్తున్న వారు ఫార్మసీ డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌లో పలు సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ యండమూరి పద్మ మీనాక్షి అధ్యక్షతన కార్యదర్శి కొప్పెర్ల చక్రధారి, వైస్ ప్రెసిడెంట్లు వి.వెంకటస్వామి, బి.శివరామకృష్ణ, సంఘ సభ్యుల పర్యవేక్షణలో ఈ వేడుక ఘనంగా జరిగింది. గడచిన నాలుగేళ్లలో ఉద్యోగ విరమణ, పదోన్నతులు పొందిన ఏడుగురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌జీఓ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, ఫార్మసీ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం సహా 350 మంది ఫార్మసిస్టులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

దిగంబరా.. దిగంబరా..
శ్రీపాద వల్లభ దిగంబరా..

- ఘనంగా దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు
- కన్నుల పండువగా గ్రామోత్సవం



శ్రీపాద శ్రీవల్లభ, దత్తాత్రేయ స్వామి వారి పాదుకలకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దత్తాత్రేయ స్వామి, ఆయన అవతారంగా భక్తులు భావించే శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మస్థలం కావడంతో పిఠాపురంలో ఈ మహోత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల భక్తులు సైతం వచ్చి దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. దీంతో ఇక్కడ ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో ఈ మహోత్సవాల తొలి రోజున స్వామివారి పల్లకీ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. తమ చెంతకే వచ్చిన దత్తాత్రేయ స్వామి వారిని పలువురు భక్తులు తిలకించి పులకించారు.

పోటెత్తిన మరాఠీ భక్తులు

దత్త జయంతి సప్తాహ మహోత్సవాల ప్రారంభం సందర్భంగా శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారు వారం రోజుల పాటు ఇక్కడే ఉండి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. సుమారు 30 వేల మంది మరాఠీ భక్తులు వచ్చినట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

విజేత ఎవరో!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపు
- పూర్తయిన ఏర్పాట్లు
- మొత్తం లెక్కించే ఓట్లు 15,502
- బరిలో ఐదుగురు
- ఇద్దరి మధ్యనే ప్రధాన పోటీ



జేఎన్‌టీయూకే కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉపాధ్యాయ వర్గ ప్రతినిధిగా రాష్ట్ర పెద్దల సభకు వెళ్లేది ఎవరో కొద్ది గంటల్లో తేలిపోనుంది. రాష్ట్ర శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలో విజేత ఎవరనే సస్పెన్స్ వీడిపోనుంది. ఇంకా రెండేళ్ల పదవీ కాలం ఉండగానే.. ఏలూరుకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ హఠాన్మరణంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. మిగిలి ఉన్న రెండేళ్ల పదవీ కాలానికి గత గురువారం ఎన్నికలు నిర్వహించారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 116 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరిగింది. రికార్డు స్థాయిలో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16,737 ఓటర్లకు గాను 15,502 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల తలరాతలను నిర్దేశించే ఓటర్ల మనోగతం కాకినాడ జేఎన్‌టీయూలోని అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములో భద్రంగా ఉంది. ఈ ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఓట్లను లెక్కించిన అనంతరం ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి వెల్లడించనున్నారు.

14 టేబుళ్లు.. 9 రౌండ్లు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జేఎన్‌టీయూకేలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. లెక్కింపు కేంద్రంలో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం పోలైన ఓట్లను 9 రౌండ్లలో లెక్కించనున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు జరగనుంది. తొలి దశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం, సమగ్ర లెక్కింపు ప్రక్రియ చేపడతారు. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయ్యింది. ఓట్ల లెక్కింపు సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటల లోపే లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఇప్పటికే సూచించారు.

అభ్యర్థుల ఎదురు చూపులు

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచినా.. పోలింగ్ సరళిని బట్టి ప్రధాన పోరు మాత్రం ఇద్దరి మధ్యనే జరిగిందనే స్పష్టమైంది. బొర్రా గోపి మూర్తి (భీమవరం), గంధం నారాయణరావు (ద్రాక్షారామ), పులుగు దీపిక, డాక్టర్ నాగేశ్వరరావు కవల, నామన వెంకటలక్ష్మి (విల్ల లక్ష్మి) ఈ ఎన్నికల్లో పోటీ పడ్డారు. ఈ అయిదుగురు అభ్యర్థుల్లో ప్రధానంగా గంధం నారాయణరావు, బొర్రా గోపిమూర్తి మధ్యనే పోటీ నెలకొంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వీరిద్దరూ అన్ని స్థాయిల్లో పోటాపోటీగా ప్రయత్నాలు చేశారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ పడిన గంధం నారాయణరావు రెండోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఏది ఎలా ఉన్నా తెల్లవారితే తేలనున్న ఫలితం కోసం అభ్యర్థులందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాల వారీగా మొత్తం ఓట్లు, లెక్కించే ఓట్ల వివరాలు

జిల్లా	మొత్తం ఓట్లు	లెక్కించే ఓట్లు	శాతం
కాకినాడ	3,418	3,118	91.22
తూర్పు గోదావరి	2,990	2,753	92.07
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3,296	3,138	95.21
అల్లూరి సీతారామరాజు	637	565	88.70
పశ్చిమ గోదావరి	3,729	3,484	93.43
ఏలూరు	2,667	2,444	91.64

స్ట్రాంగ్ రూము పరిశీలన

జేఎన్‌టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల స్ట్రాంగ్ రూమును కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను, ఎన్నికల సామగ్రిని, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు.



ఓట్లు లెక్కించేందుకు కౌంటింగ్ టేబుల్ వద్ద ఏర్పాటు చేసిన బాక్సులు



జేఎన్‌టీయూకే స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

క్లుప్తంగా

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే గూడ్స్ యార్డు వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. దీనిపై రైల్వే గూడ్స్ లోకో పైలెట్ శనివారం అర్ధరాత్రి స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి సమాచారం సేకరించారు. రైలు ఢీకొని బలమైన గాయాలు తగలడంతో మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి వయసు 30–35 ఏళ్ల మధ్య ఉంటుందని, చామనఛాయ రంగులో ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని ఒంటిపై నీలం, బూడిద రంగు అడ్డగీతల టీషర్టు, నీలం, తెలుపు గడుల టవల్ ఉందన్నారు. ఎడమ చేతిపై పి.నాగేశ్వరరావు, లోవ అని, పాము ఆకారంలో, మెడకు కుడివైపు తేలు బొమ్మ ఆకారంలో మరో పచ్చబొట్టు ఉందన్నారు. కుడి దవడపై సూర్యుడి బొమ్మతో పచ్చబొట్టు వేసుకున్నాడని అన్నారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్సై లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం

జగ్గంపేట: మోటార్ సైకిలిస్టును కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఏలేశ్వరంలో విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వర లోవరాజు (40) మోటార్ సైకిల్‌పై జగ్గంపేట నుంచి బంధువుల ఇంటికి కిర్లంపూడి మండలం తిమ్మాపురం వెళ్లేందుకు రామవరం వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లోవరాజును హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం 108 అంబులెన్స్‌లో కాకినాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

చెరువులో పడి..

నల్లజర్ల: బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. పడమర చోడవరం గ్రామానికి చెందిన మద్దిపాటి సూరిబాబు (50) శనివారం ఓ వివాహ వేడుకకు రాజమహేంద్రవరం వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో నల్లజర్లలో కారు దిగి బహిర్భూమి కని ముత్యాలమ్మ చెరువు గట్టుకు వెళ్లాడు. చీకట్లో దారి తెలియక కాలుజారి నీటిలో పడి మృతి చెందాడు. ఉదయాన్నే చెరువు గట్టున చెప్పులు కనపడటంతో మృతదేహాన్ని చెరువులో ఉన్నట్టు గుర్తించారు. సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో..

పెదపూడి: మద్యం తాగిన వ్యక్తి చెరువులో పడి మృతి చెందినట్టు అనపర్తి ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అనపర్తి గ్రామానికి చెందిన దొడ్డ మధుకుమార్ (54) శనివారం రాత్రి మద్యం తాగి భార్యతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం మధుకుమార్ తన స్నేహితులతో కలిసి కుతుకులూరులో గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న చెరువు వద్ద మళ్లీ మద్యం తాగాడు. ఉదయానికి అతను చెరువులో శవమై తేలాడు. మృతుని కుమారుడు మనోజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మేటివ్‌కు సిద్ధం..

- ఎట్టకేలకు పరీక్షల షెడ్యూల్ విడుదల
- 11 నుంచి 19 వరకూ నిర్వహణ
- ఆయా కేంద్రాలకు చేరిన ప్రశ్నపత్రాలు

రాయవరం: విద్యార్థుల తరగతుల వారీగా అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యా శాఖ ఏటా వివిధ పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రతి విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించడం పరిపాటి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలుగా పేరు మార్చారు. ఇప్పటికే రెండు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించగా, ఐదు నెలలకు ఒకసారి నిర్వహించే సమ్మేటివ్ పరీక్ష మొదటిది అక్టోబర్ మాసాంతం లేదా నవంబర్ మొదటి వారంలో నిర్వహించాలి. ఇప్పటికే దాదాపు సగం విద్యా సంవత్సరం పూర్తయ్యింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ సమ్మేటివ్-1 పరీక్ష నిర్వహించలేదు. ఈ నెల మొదటి వారంలో నిర్వహించాల్సి ఉండగా, నాస్, ఎన్ఎంఎంఎస్ పరీక్షల కారణంగా ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకూ జరపాలని ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్ విడుదల చేశారు.

సాంప్‌గా పేరు మార్పు

ఇప్పటి వరకూ ఐదు నెలలకు ఒకసారి నిర్వహించే పరీక్షలను సమ్మేటివ్-1, 2 పరీక్షలుగా పిలుస్తున్నారు. అయితే సమ్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపరు (సాంప్)గా పేరు మార్చారు. ఇప్పటికే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలుగా పేరు మార్చారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలతో పాటు, అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు తప్పనిసరిగా సమ్మేటివ్-1 పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంది. అయితే ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా అయ్యే పరీక్ష పత్రాలను ప్రైవేట్ విద్యా సంస్థలు వారి ఐచ్ఛికానికి వదిలేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 436 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, 105 ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే ఎస్‌సీఈఆర్‌టీ పరీక్ష పత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నాయి. మిగిలిన ప్రైవేట్ విద్యా సంస్థలు సొంతంగా పరీక్ష పత్రాలతో పరీక్షలు నిర్వహించుకుంటాయి. సమ్మేటివ్-1 పరీక్షలకు సంబంధించి విద్యా శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూ ఆర్ కోడ్‌ను కేటాయించారు. పరీక్ష పేపర్లను ఎవరు లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

రెండు ఫార్మేటివ్ పరీక్షలు పూర్తి

ఇప్పటికే ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1, 2 పరీక్షలు పూర్తయ్యాయి. ఆగస్టులో సెల్ఫ్ అసెస్‌మెంట్-1, అక్టోబర్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించారు. మూల్యాంకనం చేసిన పరీక్ష పేపర్లను ఇప్పటికే ఆన్‌లైన్ చేశారు. జనవరిలో ఫార్మేటివ్-3, మార్చిలో ఫార్మేటివ్-4, ఏప్రిల్‌లో 1–9 తరగతులకు సమ్మేటివ్-2, మార్చి నెలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు.

గంట ముందే ప్రశ్నపత్రాలు

ఎమ్మార్సీ, స్కూల్ కాంప్లెక్స్‌ల్లో పరీక్షకు గంట ముందే ప్రశ్నపత్రాలను ఇస్తుండడంతో వాటిని పాఠశాలకు చేర్చడానికి ఉపాధ్యాయులు నానా హైరానా పడుతున్నారు. 1 నుంచి 10 తరగతులకు రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రశ్నపత్రాలను తయారు చేసింది. ఈ పత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) ద్వారా ఎంఆర్సీలకు అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఎస్ఏ-1 పరీక్షలు ఉదయం 6, 7, 8 తరగతులకు, మధ్యాహ్నం 9, 10 తరగతులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విధానం మూడు విద్యా సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. 1–10 తరగతుల పరీక్ష పేపర్లు ఎమ్మార్సీల నుంచే తీసుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు ప్రతి రోజూ ప్రశ్నపత్రాలను తీసుకు వెళ్లడం కష్టమని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎమ్మార్సీలకు దూరంగా ఉండే కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు ఈ విధానం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

1.08 లక్షల మంది విద్యార్థులు

సమ్మేటివ్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1,08,290 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 1–5 తరగతుల వరకూ 42,230 మంది, 6–10వ తరగతి వరకూ 66,060 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా మొత్తం మీద 1,583 ప్రభుత్వ యాజమాన్య, 436 ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 2,10,080 మంది విద్యార్థులు సమ్మేటివ్-1 పరీక్షలు రాయనున్నారు.



షెడ్యూల్ విడుదల



ఈ నెలలో సాంప్-1 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇప్పటికే జిల్లా కేంద్రానికి ప్రశ్న పత్రాలు చేరుకున్నాయి. వాటిని మండల విద్యాశాఖ కార్యాలయాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాం. అధికారికంగా షెడ్యూల్ విడుదల కావడంతో తదుపరి చర్యలు తీసుకుంటున్నాం.

–బి.హనుమంతరావు, సెక్రటరీ, డీసీఈబీ, అమలాపురం

కట్టుదిట్టంగా నిర్వహిస్తాం..



విద్యాశాఖ రాష్ట్ర అధికారుల నిర్ణయం మేరకు మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి ఒక గంట ముందు మాత్రమే ప్రశ్న పత్రాలు తీసుకు వెళ్లాలి. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే సమ్మేటివ్-1 పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

ఇళ్ల మధ్య మద్యం దుకాణమా!


సీతానగరంలో మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

- సీతానగరంలో మహిళల ఆందోళన
- వెంటనే తరలించాలని డిమాండ్

సీతానగరం: ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తరలించాలని సీతానగరంలో మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఇక్కడి రాజుల వీధిలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం పెట్టడంతో సాయంత్రం 6 గంటలకు ఆ దుకాణం వద్ద నిరసన తెలిపారు. తోలేటి దుర్గ, తోలేటి మాధవి, బైర్రాజు రాజ్యలక్ష్మి, బైర్రాజు అరుణ, కుక్కెర్లపాటి పద్మ, పిల్లి నీలవేణి, పిల్లి పుష్ప తదితరులు మద్యం దుకాణం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. చినకొండేపూడి అమ్మన్న కాంప్లెక్స్‌లో బ్రాందీ షాపు పెట్టారని, కొన్ని రోజుల అనంతరం అక్కడి నుంచి ఇక్కడకు ఎందుకు తీసుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య షాపు పెట్టి మద్యం అమ్మకాలు జరపడం తమకు చాలా ఇబ్బందిగా ఉందని, మద్యం తాగే వారితో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. యువతులు, మహిళలు బయటకు రావాలంటే మందుబాబుల కారణంగా భయాందోళనకు గురవుతున్నామని వాపోయారు. ఎనిమిది అడుగుల రోడ్డులో బ్రాందీ షాపు పెట్టారని, బయటకు రావాలంటే మద్యం తాగిన వారు దుర్భాషలాడుతూ దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

బయటకు రావాలంటే భయంగా..



ముందుగా చినకొండేపూడి అమ్మన్న కాంప్లెక్స్‌లో మద్యం షాపు పెట్టారు. అక్కడి నుంచి ఇళ్ల మధ్యకు మార్చారు. షాపు వద్దే మద్యం తాగుతున్నారు. పనులపై బయటకు రావాలంటేనే భయపడుతున్నాం. ఇక్కడ మహిళలకు రక్షణ లేకుండా పోయింది.

–పిల్లి పుష్ప, సీతానగరం

అధికారులు పట్టించుకోక..



ఇళ్ల మధ్య మద్యం షాపు పెట్టడం ఇదే మొదటి సారి. గతంలో ఎవరికి ఇబ్బందులు లేకుండా దూరంగా ఉండేవి. ఇప్పుడు ఇళ్ల వద్ద మద్యం దుకాణం పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–బైర్రాజు మురళీరాజు, సీతానగరం

ఆ బియ్యం పీడీఎస్ నిల్వలే

తుని రూరల్: మండలంలోని కొలిమేరు శివారు కోళ్లఫారం షెడ్డులో ఈ నెల 6న పట్టుబడిన బియ్యం పీడీఎస్ బియ్యంగా నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. గ్రామస్తుల నుంచి అందిన సమాచారంతో ఎంఎస్ఓ రాజు, ఆర్ఐ తాతారెడ్డి, వీఆర్వో శివరామకృష్ణ ఆకస్మిక దాడి చేసి కోళ్ల ఫారంలో రూ.12,08,680 విలువ చేసే 522 బస్తాల (26,280 కిలోలు) బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. కోళ్ల మేతకు తీసుకు వచ్చినట్టు కోళ్లఫారం నిర్వాహకుడు వేగిశెట్టి యేసుబాబు నమ్మబలికాడు. దీనిపై అనుమానం వచ్చిన అధికారులు నమూనాలు సేకరించి బియ్యాన్ని పరీక్షలకు పంపించారు. పీడీఎస్ బియ్యంగా నిర్ధారణ కావడంతో ఎంఎస్ఓ ఇచ్చిన ఫిర్యాదుతో నిత్యవసరాల చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆదివారం తెలిపారు. ఆ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు.

కాకినాడలో నటి శ్రీలీల సందడి

జేసీ మాల్ ప్రారంభం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలో సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన జేసీ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ మూడంతస్తులు తిరిగి వివిధ రకాల చీరలు, ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాకినాడకు రావడం చాలా సంతోషంగా ఉందని, గతంలో కూడా ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. షాపింగ్ మాల్‌లో రకరకాల ఉత్పత్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. సరసమైన ధరలు అందిస్తున్న షాపింగ్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేయాలని అన్నారు. మాల్ అధినేతలు ఎం.వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ జేసీ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా కాంబో ఆఫర్లు ఇస్తున్నామన్నారు. తక్కువ ధరలో నాణ్యమైన వస్త్రాలు అమ్మడమే తమ సక్సెస్‌కు కారణమన్నారు. మహిళలు మెచ్చే ఎన్నో రకాల చీరలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీలీలను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది.


జేసీ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి శ్రీలీల

కాకినాడలో మహిళ దారుణ హత్య


మృతి చెందిన మీనాకుమారి

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ మహిళ హత్యకు గురైంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన ఈ హత్యకు సంబంధించిన వివరాలివీ.. పర్లోవపేటకు చెందిన ఆకుల మీనాకుమారి (36) సుమారు ఆరేళ్ల కిందట భర్తను విడిచి రామకృష్ణారావు పేటకు చెందిన సబ్బి రాంబాబు రెడ్డితో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో తనతో సహజీవనం చేస్తున్న మీనాకుమారి మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందన్న అనుమానంతో వీరిద్దరి మధ్య కొన్నాళ్లుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాంబాబు మీనాకుమారితో ఫోన్‌లో ఘర్షణ పడ్డాడు. ఇరువురి వాదన అనంతరం ఆమె రాంబాబు ఇంటికి వచ్చింది. అప్పటికే కోపంతో ఉన్న రాంబాబు ఆవేశంతో ఊగిపోతూ రోడ్డుపై ఉన్న ఆమెతో ప్రత్యక్ష ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ ఇనుప రాడ్డుతో మీనాకుమారి తలపై కొట్టాడు. అక్కడికక్కడే ఆమె కుప్పకూలిపోగా స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన రాంబాబు పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

నల్లజర్ల: ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతున్న యువకుడు ఓ యువతిపై అఘాయిత్యానికి యత్నించాడు. అడ్డుకున్న ఆ యువతి తల్లిపై అతను కత్తితో దాడి చేశాడు. నల్లజర్ల అంబేడ్కర్ కాలనీకి చెందిన యువతి ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ రాసింది. ఇంటి వద్దే ఉంటోంది. అదే కాలనీలో బొమ్మిడి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గుర్రం రాజు ఆమెను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. ఈ విషయం ఆమె తల్లిదండ్రులకు చెప్పడంతో పెద్దల వద్దకు పిలిపించి మందలించారు. ఆదివారం మధ్యాహ్నం ఆ యువతి తల్లితో పాటు చర్చికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కమ్యూనిటీ హాలు సమీపంలో తల్లి ఎదుటే ఆమెపై అఘాయిత్యానికి రాజు ప్రయత్నించాడు. దీనిని తల్లి అడ్డుకోవడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజు దాడి చేసి పరారయ్యాడు. గాయాలు కావడంతో యువతి తల్లిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ దాడి జరిగిన మాట వాస్తవమేనని, పెనుగులాటలో కమ్యూనిటీ హాలు మెట్లపై పడి నాపరాయి ఆమెకు తగిలినట్టు వివరించారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

కొవ్వూరు: జాతీయ రహదారిపై కొవ్వూరు శివారులోని ఏషియన్ పెయింట్స్ గోడౌన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన మల్లిడి అప్పారావు (63)గా గుర్తించారు. ఖమ్మం జిల్లా మణుగూరులో చేపల వేట నిమిత్తం గ్రామస్తులతో కలసి అతను వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి వ్యాన్‌లో వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అప్పారావుతో పాటు మరో వ్యక్తి వ్యాన్‌పై ఉంచిన వలలపై నిద్రిస్తున్నారు. మిగిలిన కూలీలంతా వ్యాన్ క్యాబిన్‌లో కూర్చున్నారు. వ్యాన్ పైనుంచి అప్పారావు జారి రోడ్డుపై పడిపోవడంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. వివిధ వాహనాలు అతని శరీరంపై నుంచి వెళ్లిపోయాయి. దీంతో శరీర అవయవాలు నుజ్జునుజ్జు అయ్యాయి. పట్టణ పోలీసులు రోడ్డుపై పడి ఉన్న మాంసపు ముద్దలను పోగుచేసి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వ్యాన్ బొబ్బల్లంక సమీపంలోకి వెళ్లేసరికి అప్పారావు కనిపించడం లేదని సహచరులు గుర్తించారు. ఈ సమాచారాన్ని అతని కుటుంబ సభ్యులకు అందించారు. అక్కడి నుంచి వెతుక్కుంటూ వస్తుండగా, కొవ్వూరులో ఓ వ్యక్తి మరణించినట్లు తెలుసుకున్నారు. పోలీసుల వద్ద లభ్యమైన దుస్తులు, దుప్పటి ఆధారంగా మృతదేహం అప్పారావుదిగా గుర్తించారు. శనివారం రాత్రి వీఆర్వో కె.మౌనిక ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు అప్పారావుకు భార్య, వివాహమైన కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి, అల్లుడు మోసే రాజులకు మృతదేహ భాగాలను పోలీసులు అప్పగించారు.

కొడుకుపై హత్యాయత్నం కేసు

తాళ్లపూడి: తండ్రిని గాయపరిచిన ఘటనలో కొడుకుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన పూల వీరవెంకట మణికంఠ (22) తన తండ్రి వీరాంజనేయులును బైక్ కొనమని అడిగాడు. ఆయన నిరాకరించడంతో మద్యం మత్తులో మెడ పట్టుకుని నొక్కడంతో వీరాంజనేయులు మాట కోల్పోయి, స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు మణికంఠపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం


బిక్కవోలులో గ్రామోత్సవంలో శక్తివేషాలు


బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఊరేగింపు

బిక్కవోలు: బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రథోత్సవం ప్రారంభమైంది. దీనికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లె వాసు హాజరయ్యారు. ఆలయం నుంచి జి.మామిడాడ రోడ్డు మీదుగా రథోత్సవం సాగింది. ఇదిలా ఉంటే శనివారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. సర్పం, విజిల్స్, ఈత చెట్టు, కలర్స్ ఈతచెట్టు, జపాన్ రింగ్, మల్లె పందిరి, సూర్యచక్రం, బ్యాటరీ బాక్సులు, మిరుమిట్లు గొలిపే తారాజువ్వలు తదితర వెరైటీలను ఈ పోటీలలో ప్రదర్శించారు. ఈ బాణసంచా కాల్పులను చూడడానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో పాలచర్ల చిట్టిబాబు చౌదరి, ఆలయ ఈఓ రామలింగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దోపిడీని అరికట్టండి

కాజులూరు: ధాన్యం కొనుగోలులో రైతులను మిల్లర్లు దోపిడీకి గురిచేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఆదివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ మాసూళ్ల అనంతరం రైతులు విక్రయించే ధాన్యంలో సాధారణంగా 15 నుంచి 18 వరకూ తేమ శాతం ఉంటుందన్నారు. అది మించిదే రైతులు ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టి తేమ శాతం తగ్గించి విక్రయాలు చేస్తుంటారన్నారు. అయితే ఇటీవల తుపాన్ల కారణంగా ఎండ లేకపోవటంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వీల్లేకుండా పోయిందన్నారు. దీనిని సాకుగా తీసుకుని మిల్లర్లు ధాన్యాన్ని ధర తగ్గించి కొంటున్నారన్నారు. కళ్లాల వద్ద ధాన్యం తేమ శాతం (మార్చ్యురి) 16, 17 శాతం చూపిస్తుండగా రైసుమిల్లుల వద్దకు వెళ్లేసరికి మిల్లర్లు మార్చ్యురి 20, 22 శాతం ఉంటుందంటూ బస్తాకు రెండు వందల వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. గతంలో మార్చ్యురి 20 శాతం వరకూ ఉన్నప్పటికీ మద్దతు ధరకు కొనుగోలు చేసేవారని, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కౌలురైతు సంఘ అధ్యక్షుడు కురుపూడి భూచక్రం, రైతులు నామ చంద్రరావు, తాతారావు, పెంకే రవితేజ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడతో ఆత్మరక్షణ


తైక్వాండో బ్లాక్‌బెల్ట్ అర్హత సాధించిన విద్యార్థులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆత్మరక్షణకు తైక్వాండో వంటి క్రీడలు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తైక్వాండో బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవం కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ స్కూల్‌లో ఘనంగా జరిగింది. దీనికి (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా, ఆశ్రమ్ స్కూల్ పీడీ శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు మాట్లాడుతూ ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 8 మంది జాతీయ రిఫరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా 2 డాన్ బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ఆరుగురు, 1వ డాన్ బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో 25 మంది బ్లాక్ బెల్ట్ క్రీడాకారులుగా అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తైక్వాండో క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. మొత్తం 31 మంది బ్లాక్‌బెల్ట్ క్రీడాకారులు అర్హత సాధించడంపై తైక్వాండో కోచ్, కార్యదర్శి అర్జునరావు, ఇతర కోచ్‌లను ఆయన అభినందించారు. అనంతరం క్రీడాకారుల తైక్వాండో విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అర్హత సాధించిన క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్‌లను అందించారు.